క్లుప్తంగా

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి



పాదయాత్ర చేస్తున్న నేతలు

దక్కిలి: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి బయలుదేరిన వడ్డెర్ల మహాపాదయాత్ర బాలాయపల్లి మండలం నుంచి ఆదివారం సాయంత్రం డక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చేరుకుంది. పాదయాత్ర చేస్తున్న వడ్డెర్లకు పచ్చారిచేను, వెంకటరెడ్డిపల్లి, నిండలి, దగ్గవోలు గ్రామాలకు చెందిన పలువురు వడ్డెర్లు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. తిరుపతి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.అమర్నాథ్ మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వారం రోజులు కిందట తిరుపతి నుంచి పాదయాత్ర చేపట్టామన్నారు. వడ్డెర సంఘం నేతలు వల్లెపు ఈశ్వర్, చెంచుకృష్ణయ్య, చల్లా లక్ష్మయ్య, హరి, వెంకటరమణ, నరేష్ పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

నాయుడుపేటటౌన్: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విన్నమాల గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో నాయుడుపేట నవజీవన్ స్వచ్ఛంద సంస్థ గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేత మహిళలకు బహుమతులను ప్రదానం చేసినట్లు సంస్థ మేనేజర్ బాలాజి తెలిపారు. అదేవిధంగా వరుస విజేతలుగా నిలిచిన ముగ్గురిని జిల్లాలో జరిగే ముగ్గుల పోటీలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూలు సీహెచ్ సుప్రజ, ఏ.లావణ్య, శ్రావణి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పెళ్లకూరు: చెంబేడు గ్రామంలో ఆదివారం శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో గ్రామ పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు వివేక్, మల్లికార్జున్, ఉమామహేష్, అర్చన పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



డీవీ సత్రం యూటీఎఫ్ కమిటీ

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఆదివారం జిల్లా నాయకులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాధాకృష్ణయ్య, అధ్యక్షులు దిలీప్‌కుమార్, రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ, ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌బాషా, కోశాధికారి భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నేతలు బాబు, సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లాయర్ల నూతన కార్యవర్గం



నూతన కమిటీ

గూడూరురూరల్: న్యాయవాదుల సంఘంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కొత్తగా అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమాన న్యాయం జరిగేలా అసోసియేషన్ పాటుపడుతుందని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎప్రకటించారు. వీరిలో తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వి.పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా పార్వతయ్య, కోశాధికారిగా ఎం మనోహర్, సభ్యులను ఎన్నుకున్నారు.

మల్లాం ఆలయంలో అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో కొలువైయున్న కామాక్షీదేవి సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకంలో స్వామివారు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆకాశదీప దర్శనం, జ్వాలా తోరణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి భక్తులకు సామూహిక అన్నదానం చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తితో జగనన్న పాలన



వాకాడు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



గూడూరు: సీఎం కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తడలో నివాళి



9వ బెటాలియన్ సిబ్బంది ప్రతిజ్ఞ

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం 74 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి రామ్‌కుమార్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలు అనన్యమని, ఆయన రూపొందించిన రాజ్యాంగం చారిత్రాత్మకమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ నాగభూషణమ్మ, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, రవి, రామలింగారెడ్డి, శ్రీనివాసులు, మస్తానయ్య పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపేందుకే రాజ్యాంగం: ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: బ్రిటీష్ పాలన తరువాత దేశంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రాజ్యాగంలోని నిర్దేశిక సూత్రాలను నేడు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. పట్టణ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఎం.వీనయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గోవర్ధన్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్‌రెడ్డి, అట్రాసిటీ కమిటీ సభ్యుడు రవీంద్రబాబు, సర్పంచ్ శీనయ్య, జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, నేతలు వెంకటరామయ్య, మురళీ, అల్తాఫ్ లక్ష్మి, భవాని పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కె.దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు, కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బామ్‌సేఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘ డివిజన్ పరిధిలోని నాయకులు రాజ్యాంగ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిరదవాడ, మేనకూరు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల వద్ద వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ నేతలు ఘనంగా నివాళులర్పించారు.

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాతబస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కె.దీపిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, కె.జయరామయ్య, బి.మల్లికార్జునరెడ్డి, పేర్నాటి రాహుల్, జి.సిద్ధయ్య, పి.హరినాథ్‌రెడ్డి, రత్నశ్రీ, జెసీఎస్ కన్వీనర్ సీహెచ్ కుమార్, పి.వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, జి.సిద్ధయ్య, పాల్గొన్నారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చిల్లకూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మన్నెం వీనయ్య, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్‌రెడ్డి, స్కావెంజర్ అట్రాసిటీ కమిటీ సభ్యుడు ప్రభాకర్, నేతలు అశోక్, క్రిష్టారెడ్డి, అనూరాధ, అనుదీప్, శ్రీనివాసులు, మాధవయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ కేడెట్లు రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ సమైక్యతను చాటుతూ ర్యాలీ నిర్వహించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, లెఫ్టినెంట్ మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో ...

అదేవిధంగా ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళిలర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గద్దల మునెయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే రఫి, సభ్యులు పాల్గొన్నారు.

తడలో..

తడ: తడకండ్రిగ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కే ఆర్ముగం, మండల జేసీఎస్ కన్వీనర్ సుందర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, టి.రాజ్‌కుమార్, గురుస్వామి, శశికుమార్, శ్రీనివాసులు, జేడీ రాజు, రమేష్, శివకుమార్, ప్రసాద్, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని తెలుగురాయపురం ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జీవీ మురళీకృష్ణ డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరిరూరల్: వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్ కన్నా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.



నాయుడుపేట: మున్సిపల్ కార్యాలయంలో..



నాయుడుపేట: నివాళులర్పిస్తున్న నేతలు



చిల్లకూరులో నేతల నివాళి



కోట: మొక్కలు నాటుతున్న క్యాడెట్లు



కలువాయిలో నివాళి

హిందూ ధర్మం ఆచరణీయం

కోట: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోటలో హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి గీత పీఠం ప్రణవానాత్మానంద స్వామీజీ హాజరయ్యారు. గ్రామగ్రామాన దేవాలయాలు కేంద్రంగా హిందూ ధర్మప్రచారం చేస్తూ ప్రజలతో ధార్మిక, సామాజిక చైతన్యం కలిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కోటలో భజన బృందంతో శోభాయాత్ర, నగర సంకీర్తన నిర్వహించారు. శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఫౌండేషన్ సేవా ప్రముఖ్ విజయలక్ష్మి, కోటమ్మ దేవస్థానం ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.



కోటలో శోభాయాత్ర

ఆలయ హుండీ చోరీ

ఓజిలి: ఓజిలి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి హుండీని చోరీ చేశారు. ఆలయంలో రోజూలానే రాత్రి పూజలను ముగించుకుని అర్చకులు ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చి చూడగా గేట్ల తాళాలను ధ్వంసం చేసి హుండీని ఎత్తుకెళ్లి కానుకలను చోరీ చేసి ఆర్బీకే వద్ద పడేశారు. స్థానికులు పడేసిన హుండీని చూసి పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో రూ.40 వేల నగదు ఉండవచ్చని అర్చకులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టపైర్లపై అవగాహన పెంచుకోవాలి

కలువాయి: మెట్టపైర్ల సాగుపై రైతులు అవగాహన పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ అన్నారు. మెట్టపైర్లు సాగును రైతులకు తెలియజేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వరి సాగు చేసేందుకు వీలులేని కారణంగా రైతులు మెట్టపైర్లు సాగు చేసుకుని వ్యవసాయ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

కండలేరులో 11.099 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 11.099 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 235 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం 1992–94 ఇంటర్ చదివిన విద్యార్థులు 30 ఏళ్ల తరువాత కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా తమ ప్రసంగాల్లో ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మధుసూదన్‌రెడ్డి, ఖాన్, రాజగోపాల్‌రెడ్డి, క్రిష్ణమోహన్‌లను ఘనంగా సన్మానించుకుని గురుభక్తిని చాటారు. ఎన్‌బీకేఆర్ కళాశాల ఉన్నతికి తమవంతు సాయం అందిస్తామన్నారు.

కొండ శిఖరంపై కార్తీక దీపం



గాండ్ల కులస్థుల ఆధ్వర్యంలో కార్తీక అఖండ దీపానికి పూజలు

తిరుపతి కల్చరల్: కార్తీక మాసం, కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆదివారం కపిలతీర్థం కొండ శిఖరంపై సాయంసంధ్య వేళ కార్తీక అఖండ దీపం దేదీప్యమానంగా వెలుగులు విరజిల్లుతూ దర్శనమిచ్చింది. తిరుపతిలోని గాండ్ల కులస్తులు పూర్వీకుల నుంచి కపిలతీర్థం కొండ శిఖరంపై దీపం వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం గాండ్లమిట్ట వద్దనున్న శ్రీరామ గాండ్ల భజన మందిరం నుంచి గాండ్ల కులస్తులు మధ్యాహ్నం 2.30 గంటలకు కపిలతీర్థంలోని కొండశిఖరానికి చేరుకున్నారు. సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపాన్ని వెలిగించారు. తిరుపతి గాండ్ల కుల సంఘం నేతలు పాతలపాటి శేఖర్, ప్రసాద్, బండారు శ్రీనివాసులు, సాకం ప్రభాకర్,దాము, కోదండం, మద్దూరు గిరి, తిలక్, రాజేంద్రప్రసాద్, పార్థు, కిట్టు, సాత్విక పాల్గొన్నారు.

కందుకూరు సభను విజయవంతం చేద్దాం

తిరుపతి కల్చరల్: ప్రకాశం జిల్లా కందుకూరులో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగే సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వెయ్యి మంది వెనుకబడిన తరగతులకు చెందిన వారు కందుకూరు సభకు హాజరై తమ సత్తా చాటనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన రామ్‌కుమార్ నాదార్‌కు ఆయన నియామక పత్రం అందజేశారు. సోమశేఖర్ ఆచారి, మధు మార్గాచారి, వాసుకుమార్ గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి పూజలు



బంగారుపేట భవాని శంకరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిల్లకూరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సైదాపురంలో చిన్నారి పూజలు

నాయుడుపేటటౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరీ దేవి ఆలయంలో అభిషేకాలు జేసి స్వామివారికి శివనారాయణ అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అదేవిధంగా అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉసిరి వనం వద్ద శివకేశవుల ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాలు చేశారు.

గూడూరులో..

గూడూరురూరల్: పట్టణంలోని పటేల్ వీధిలోని సాయి సత్సంగ నిలయంలో ఆదివారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేదపండితులచే సూర్య నమస్కారం, సౌర అరుణహోమం, శ్రీచక్ర ఆర్చన, ప్రత్యంగిర పారాయణ హోమం నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనం నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

రాపూరు: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రాపూరులోని రామనాదేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది, స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, మహన్యాసరుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పర్వతివర్ధని అమ్మవారికి మంగళాభిషేకం నిర్వహించారు.

సిద్ధలయ్య కోనలో..

సైదాపురం: సిద్ధలయ్య పుణ్యక్షేత్రంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వాముల వారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వెంకటగిరిలోని పలు శివాలయాలు మహిళలతో కిటకిటలాడాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని చేడిమాలలోని శివాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు దీపోత్సవంలో పాల్గొని దీపాలను వెలిగించారు. మధ్యాహ్నం ఉసిరి చెట్టు కింద భోజనాలు ఏర్పాటు చేసి భక్తితో అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి అఖండ దీపాన్ని ఆలయ శిఖరంపై వెలిగించారు.



రాపూరు శివాలయంలో భక్తులు



గూడూరు: ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



నాయుడుపేట: శివకేశవుల స్వామివార్ల ఊరేగింపు